క్లుప్తంగా

పంటకాలువలో గుర్రపుడెక్క తొలగింపు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజు పాలేన్ని ఆనుకుని ఉన్న పంట కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క , పూడిక తొలగింపు పనులను శనివారం ప్రారంభించారు. మురుగునీరు, ఎర్ర కాలువ ముంపు రాకుండా వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు తన సొంత ఖర్చు రూ.90 వేలతో జేసీబీ ఏర్పాటు చేసి కాలువలోని తూడును పూర్తిగా తొలగిస్తున్నట్లు సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్ తెలిపారు. తూడు తొలగింపు పనులను పల్లారావు, ఎంపీటీసీ సభ్యుడు పడాల రంగారావు, సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

రాయితీపై జీలుగ విత్తనాలు సిద్ధం

నల్లజర్ల: రానున్న ఖరీఫ్ సీజన్‌కు ముందుగా అన్నదాతలు పచ్చి రొట్ట సాగు చేయడానికి అవసరమైన జీలుగ, జనుము విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. 50 శాతం రాయితీని మినహాయించి, మిగతా సొమ్ము చెల్లించి రైతులు విత్తనాలు పొందవచ్చునన్నారు. మొక్కజొన్న విక్రయాలకు ఆర్బీకేలలో రైతులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

104 ఉద్యోగులను ఆదుకోవాలి

నల్లజర్ల: గ్రామగ్రామానా అందరికీ ఆరోగ్యాన్ని అందించే 104 వాహన సేవక ఉద్యోగులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని 104 ఉద్యోగులు ముఖ్యమంత్రిని కోరుతున్నారు. ప్రకాశరావుపాలెంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అనంతరం 104 ఉద్యోగులు తమ ఆవేదనను ప్రభుత్వానికి తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తమను కాంట్రాక్టు, ఆప్కాస్‌లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సక్రమంగా వేతనాలు అందించాలని, జీఓ నంబర్ -4459 ప్రకారం పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలన్నారు. 104 పైలట్ బి.నరేష్, డీఈఓ సుమలత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

హోమియో వైద్య శిబిరం

నిడదవోలు రూరల్: తాడిమళ్ల గ్రామంలోని సొసైటీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. మానవత సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో హోమియోపతి వైద్యుడు నిమ్మల రామారావు 56 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కటికిరెడ్డి నారాయణరావు, మానవత సంస్థ సభ్యులు సీహెచ్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువత

- గుట్టుచప్పుడుగా ఏజెన్సీ నుంచి దిగుమతి
- యువత, విద్యార్థులే లక్ష్యంగా సరఫరా
- రోడ్డు ప్రమాదాలకు ప్రధాన మూలం


దేవరపల్లి హైవేలో పట్టుబడిన గంజాయితో పోలీసు అధికారులు (ఫైల్)


గంజాయి

దేవరపల్లి: యువత గంజాయి మత్తులో జోగుతోంది. యువత, విద్యార్థులు లక్ష్యంగా గంజాయి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో యువత భవిషత్తు నాశనం అవుతోంది. గంజాయి మత్తుకు యువత, విద్యార్థులు బానిసలవుతున్నారు. గంజాయి సేవించే యువత సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నిఘా వర్గాలు, పోలీసులు ఉన్నప్పటికి గంజాయి విక్రయాలు అదుపులోకి రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలోని నర్సీపట్నం, ఒడిశా ప్రాంతాల నుంచి మాఫియా ముఠా గంజాయిని రవాణా చేస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు మార్గమధ్యలో వాహనాలను తనిఖీ చేసి గంజాయిని పట్టుకుంటున్నప్పటికీ అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. నిఘా పెరగడంతో స్మగ్లర్లు ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను ఎంచుకుని ఖరీదైన కార్లలో గంజాయిని సరిహద్దులు దాటించి గమ్య స్థానాలకు తరలిస్తున్నారు. గంజాయి ప్యాకెట్లు జేబుల్లో పెట్టుకుని విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వస్తున్నట్టు ఇటీవల దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో జరిగిన బహిరంగ సభలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి మత్తులో యువత వాహనాలను వేగంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. దేవరపల్లి, గోపాలపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్నాయి. జంగారెడ్డిగూడెం కేంద్రంగా వ్యాపారులు దేవరపల్లి, గోపాలపురం ప్రాంతాలకు సిగరెట్ల గుల్లల్లో గంజాయి పొడిని నింపి సరఫరా చేసి డబ్బు సంపాదిస్తున్నారు. ఈ ప్రాంతాల నుంచి కొందరు యువకులు పాడేరు, నర్సీపట్నం ప్రాంతాలకు వెళ్లి కూరగాయల రవాణా మాటున దేవరపల్లి పరిసర ప్రాంతాలకు గట్టుచప్పుడు కాకుండా గంజాయిని తెచ్చి విక్రయిస్తున్నారు. ఇటీవల దేవరపల్లి మండలం కృష్ణంపాలెంలో సంభవించిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒక యువకుడు మృతి చెందగా, పాఠశాల నుంచి ఇంటికి వెళుతున్న విద్యార్థినిని వెనుక నుంచి ఇద్దరు యువకులు బైక్‌తో ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఆ బాలిక దాదాపు రెండు నెలలు కోమాలో ఉంది. దేవరపల్లి, యర్నగూడెం, గౌరీపట్నం ప్రాంతాల్లో యువత ఎక్కువగా గంజాయి బారిన పడుతున్నారు.

అనారోగ్యాలకు గురవుతున్న యువత

గంజాయి మత్తు యువత జీవితాలను సర్వనాశనం చేస్తోంది. నూరేళ్లు జీవించాల్సిన వారు గంజాయి వల్ల అనారోగ్యాలకు గురై యుక్త వయస్సులోనే ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. బ్రైన్ స్ట్రోక్, లంగ్స్, లివర్, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారుల పక్కనే గల డాబా హోటల్స్, కిళ్లీషాపుల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం.ఆయా ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేసినప్పటికి తీసుకున్న చర్యలు శూన్యమని ప్రజలు అంటున్నారు.

సిగరెట్ గుల్లల్లో గంజాయి పొడి



సిగరెట్టు గుల్లల్లో గంజాయి పొడి నింపి గుట్టచప్పుడు కాకుండా స్మగ్లర్లు సరఫరా చేస్తున్నారు. 100 గ్రాముల గంజాయిని రూ.3000 విక్రయించి వ్యాపారులు రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయి మత్తులో యువకులు అల్లర్లు సృష్టిస్తున్నారు. దారినబోయే వారితో గొడవలు పడి కేసుల్లో ఇరుక్కుంటున్నారు. గ్రామ శివార్లు, పాఠశాలలు, ఆలయాలు, చెరువు గట్టులను ఆవాసాలుగా ఎంచుకుని గంజాయి పొగను గుప్పు మనిపిస్తున్నారు. ఇటీవల దేవరపల్లిలోని హైవే వద్ద భారీ ఎత్తున గంజాయిని పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు.

నిఘా పెట్టాం



గంజాయి విక్రయాలపై నిఘా పెట్టాం. దేవరపల్లి సర్కిల్ పరిధిలోని దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో గంజాయికి బానిసైన యువకుల వివరాలు సేకరిస్తున్నాం. ఏజెన్సీ ప్రాంతాల నుంచి హైవే పై రవాణా చేస్తున్న వాహనాలను తనిఖీలు చేసి పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నాం. త్వరలోనే గంజాయి సరఫరాకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తాం. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వివరాలు సేకరిస్తున్నాం.

– ఎ. శ్రీనివాసరావు, సీఐ, దేవరపల్లి

వివాహిత అనుమానాస్పద మృతి

దేవరపల్లి: ఉరిపోసుకుని సుమశివ పార్వతి (20) అనే వివాహిత దేవరపల్లిలో శుక్రవారం ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, గోకవరం మండలం కామరాజుపేటకు చెందిన ఎక్కట్ల గంగారావు కుమార్తె సుమశివ పార్వతిని మూడేళ్ల క్రితం భీమడోలు మండలం గుండుగొలనుకు చెందిన బట్టు శోభన్‌బాబుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. శోభన్‌బాబు దంపతులు కొంతకాలంగా దేవరపల్లిలో నివాసం ఉంటున్నారు. ఈ నెల 12న మృతురాలు తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి 'పిల్లలతో ఇబ్బంది పడుతున్నాం కదా. పిల్లలను తీసుకుని మీ ఇంటికి వెళ్లమంటున్నాడు నా భర్త. కానీ నాకు ఇష్టం లేదు' అని చెప్పింది. అనంతరం మధ్యాహ్నం 3.45 గంటలకు శోభన్‌బాబు తన అత్తమామలకు ఫోన్ చేసి మీ అమ్మాయి సుమశివ పార్వతి ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందిందని సమాచారం అందించాడు. సుమశివపార్వతిని చికిత్స కోసం దేవరపల్లి పీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. మృతురాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు శనివారం రాత్రి తెలిపారు. భార్య, భర్తల మధ్య ఏర్పడిన వివాదం కారణంగా ఈఘటన జరిగినట్టు భావిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లపై నిరంతర పర్యవేక్షణ

నిడదవోలు రూరల్: ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మండల స్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామని తహసీల్దార్ ఎం.గంగరాజు తెలిపారు. సింగవరం, పురుషోత్తపల్లి, సమిశ్రగూడెం గ్రామాల్లోని రైస్ మిల్లులను, ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్ పరిశీలించారు. అందుబాటులో ఉన్న సంచులు, తేమ, నూక శాతాల తదితర అంశాలపై తహసీల్దార్ గంగరాజు ఆరా తీశారు. ఏఓ జి.సత్యనారాయణ, ఆర్ఐ సత్యేంద్ర, వీఆర్వోలు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల్లో వైద్యుల పోస్టుల భర్తీ

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- గోపాలపురం సీహెచ్‌సీ సందర్శన


కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వసతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తుందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడారు. ఆసుపత్రికి మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను వారం రోజుల్లో భర్తీ చేస్తామని కలెక్టర్ కె.మాధవీలత హామీ ఇచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వంతో పోలిస్తే గోపాలపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని చెప్పారు. ప్రతి పక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు తిప్పికొడతారన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణను ఎమ్మెల్యే తలారి పరిశీలించారు. వైద్యులతో సమావేశమై, వారికి తగిన సూచనలు అందజేసారు. ఈయన వెంట ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ ఎస్‌కే ఖాదర్‌వలీ, గెల్లా వెంకటశ్రీను వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకుంటాం

గోపాలపురం: గత నెల 17, 18 తేదీల్లో భారీ వర్షంతో పాటు పిడుగులు పడటంతో జంగారెడ్డిగూడెం ఏరియాలో పొగాకు తోటలు దెబ్బతిన్నాయి. నష్టపోయిన పొగాకు రైతులకు సాయం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల రైతుల నుంచి బ్యారన్‌కు రూ.200 చొప్పున పొగాకు బోర్డు ద్వారా అమ్మకాల్లో తగ్గించేలా తీర్మానం చేసినట్టు పొగాకు బోర్డు ఉపాధ్యక్షుడు గద్దే శేషగిరిరావు, గోపాలపురం పొగాకు బోర్డు రైతు సంఘం అధ్యక్షుడు పిన్నమనేని మధుమోహన్ శనివారం విలేకరులకు తెలిపారు. ఈమేరకు ఐదు వేలం కేంద్రాల అధ్యక్షులు, రైతుల అంగీకారంతో చేసిన తీర్మానాన్ని పొగాకు బోర్డుకు పంపినట్లు శేషగిరిరావు వివరించారు.

ఆదుకోవడం అభినందనీయం

వడగండ్ల వాన వల్ల నష్టపోయిన జంగారెడ్డిగూడెం ఏరియా పొగాకు రైతులను ఆదుకోవడం అభినందనీయమని రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజినల్ మేనేజర్ ఎం. ఆదిశేషయ్య అన్నారు. శనివారం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్‌ఎం రైతు సంఘాల నాయకులను అభినందించారు. బ్యారన్‌కు రూ. 200 చొప్పున పొగాకు అమ్మకాల్లో తగ్గించి నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి రైతు సంఘాలు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వాహణాధికారి కె. శ్యామ్, సీనియర్ గ్రేడింగ్ అధికారి ఎస్.హేమస్మిత, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,019 కేసుల పరిష్కారం


కొవ్వూరులో కక్షిదారులను విచారిస్తున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అన్నపూర్ణ

కొవ్వూరు: స్థానిక కోర్టుల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 1,019 కేసులు పరిష్కారం అయ్యాయి. నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేసి వాటిని పరిష్కరించినట్టు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి పి.అన్నపూర్ణ తెలిపారు. జిల్లా కోర్టులో ఒక బెంచ్, సీనియర్ సివిల్ జడ్జి బి.సత్యవతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మారావు, సెకండ్ అడిషనల్ అండ్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.సాయికృష్ణల ఆధ్వర్యంలో మరో మూడు బెంచ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆమె వివరించారు. ఈ మూడు బెంచ్‌ల్లో 746 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. అలాగే 17 సివిల్ కేసులు, 22 బ్యాంకు, బీఎస్ఎన్ఎల్ కేసులు, 227 క్రిమినల్ కేసులు, నాలుగు చెక్ బౌన్స్ కేసులు, రెండు మనోవర్తి కేసులు, ఒక గృహ హింస కేసును పరిష్కరించినట్టు న్యాయమూర్తి అన్నపూర్ణ వివరించారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ.80,33,234 కక్షిదారులకు చెల్లించే ఏర్పాటు చేసినట్టు తెలిపారు. లోక్ అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ సరఫరా చేశారు.

చాగల్లు స్టేషన్ పరిధిలో 56..

చాగల్లు: నిడదవోలు కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో చాగల్లు పోలీసు స్టేషన్ పరిధి 56 కేసులు పరిష్కారం అయ్యాయని చాగల్లు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. వాటితో పాటు 93 న్యూసెన్స్ కేసుల్లో 93 జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు.

మజ్జిగ వితరణ

నిడదవోలు: రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ ఆధ్వర్యంలో అడ్డగర్ల అన్నపూర్ణ ఆర్థిక సహకారంతో శనివారం పట్టణంలో మజ్జిగ వితరణ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గాలి రాఘవయ్య, ఆకుల రాజీవ్, పి.ఫణిసింహ, ఇంజే శేఖర్, గల్లా రాజు, కొయ్యే నాగులు, ఆనందం మురళి తదితరులు పాల్గొన్నారు.

'మానవత ' ఆర్థిక సాయం


కుకునూరులో ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సభ్యులు

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని కుకునూరుకు చెందిన మొదలవలస రమణ, సుజాత దంపతుల వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు అందజేశారు. మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు జె. వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈ నగదు సాయం చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య, సాయన సుబ్బారావు, ఎ. సురేష్, సనపల రాజశేఖర్, దుర్గాప్రసాద్, రమేష్, సత్యనారాయణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ దివ్యాంగురాలికి కొత్త జీవితం

- చెవిటి, మూగ యువతిని వివాహమాడిన డ్రైవర్
- ఆమె పేరున బ్యాంకులో రూ.లక్ష డిపాజిట్


దివ్యాంగురాలు దీపిక, చక్రవర్తిల వివాహం

నిడదవోలు: చెవిటి, మూగరాలైన ఓ యువతికి కొత్త జీవితాన్ని ఇచ్చేందుకు ముందుకొచ్చాడో ఓ యువకుడు. ఆమెను వివాహం చేసుకోవడమే గాకుండా ఆమె పేరున రూ.లక్ష డిపాజిట్ కూడా చేసి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. వివరాలి ఉన్నాయి. సహాయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిడదవోలులో నిర్వహిస్తున్న ఉచిత మానసిక ప్రత్యేక పాఠశాల (హృదయాలయం)లో దీపిక అనే దివ్యాంగురాలు ఆశ్రయం పొందుతోంది. అదే సంస్థలో డ్రైవర్‌గా పనిచేస్తున్న చక్రవర్తితో ఆమెకు శనివారం హిందూ సంప్రదాయంతో హృదయాలయం నిర్వాహకులు వివాహం జరిపించారు. అనాథ అయిన దీపికకు 13 ఏళ్ల వయసు ఉన్నపుడు ఐసీడీఎస్, పోలవరం అధికారులు హృదయాలయం నిర్వాహకులు దండే గణేష్, విశాలక్ష్మిలకు అప్పగించారు. గత 14 ఏళ్లుగా దీపిక ఆలనాపాలనా చూసుకుంటూ వారే పెంచి పెద్ద చేశారు. ఈ క్రమంలో చక్రవర్తి ఆమెను వివాహం చేసుకోవడమే గాకుండా దీపిక పేరున రూ. లక్ష డిపాజిట్ కూడా చేశాడు. ఈ వివాహనికి దీపిక కూడా అంగీకారం తెలపడంతో జిల్లా శిశు, మహిళా సంక్షేమ శాఖాధికారుల అనుమతితో హిందూ సంప్రదాయం ప్రకారం దండే గణేష్, విశాలాక్షిలు వివాహం జరిపించారు.

ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య


వేములపూడి వనిత వరలక్ష్మి (ఫైల్)

కొవ్వూరు: స్థానిక ఇందిరమ్మ కాలనీలో వేములపూడి వనిత వరలక్ష్మి (23) శనివారం సాయంత్రం 6.30 ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ధవళేశ్వరం నుంచి వచ్చిన బంధువులతో ఆమె తల్లి వీరవేణి, సోదరుడు గోష్పాద క్షేత్రానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఆమె ఫ్యాన్‌కి చీరతో ఉరి వేసుకుంది. కొద్దిసేపటి తర్వాత గోష్పాదక్షేత్రం నుంచి వచ్చిన కుటుంబీకులు, బంధువులు ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతున్న వరలక్ష్మిని కిందకి దింపి స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారని పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్ తెలిపారు. ఇటీవలే బీ ఫార్మసీ పూర్తి చేసిన వరలక్ష్మి ప్రస్తుతం కంప్యూటర్ శిక్షణ పొందుతోంది. ఆమె ఆత్మహత్యకు కారణాలు ఏమిటనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆమె తండ్రి దివాకర్ రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేట్ స్కూలులో వాచ్‌మన్. మృతురాలి తల్లి వీరవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కర్ణాటకలో విజయంతో కాంగ్రెస్ సంబరాలు

కొవ్వూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో మండలంలోని కాపవరంలో శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లా బేగ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యురాలు అమర్ జహబేగ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరిన్ని రాష్ట్రాల్లో విజయం సాధిస్తుందన్న ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సాకే పుల్లారావు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జొన్నకూటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు పట్టణంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అరిగెల అరుణకుమారి ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.

గోపాలపురం: మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మట్టపర్తి రామమోహనరావు ఆధ్వర్యంలో శనివారం సంబరాలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేష్ఠ సతీష్, నాయకులు గన్నిన రామారాయుడు, పిట్టా రామారావు, కుటుంబరావు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరులో కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు వెలగా రామకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.